సాక్షి ప్రకాశం

మంగళవారం । 28 । నవంబర్ । 2023



ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యం

ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్పందన నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్పందన నిర్వహించారు.

- 8లో..



ఆరోగ్యకర జీవనశైలికి ఆడుదాం ఆంధ్రా

ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
31.5/24.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. వాతావరణంలో తేమ శాతం అధికం.

న్యూస్‌రీల్

వెయిట్ లిఫ్టింగ్‌లో కేజీబీవీ విద్యార్థినులకు పతకాలు



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపల్ స్రవంతి

జరుగుమల్లి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు అండర్-17, అండర్-19 సంవత్సరాల బాలికల విభాగంలో పోటీలు ఈ నెల 23 నుంచి 25 వ తేదీ వరకు కర్నూలులో జరిగాయి. ఈ పోటీల్లో మండల పరిధిలోని కె.బిట్రగుంట కేజీబీవీ నుంచి 15 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వారిలో 71 కిలోల విభాగంలో ఎం.పూర్ణిమ బంగారు పతకం సాధించింది. 45 కిలోల విభాగంలో కె.సిరివెన్నెల కాంస్య పతకం, 49 కిలోల విభాగంలో కె.దీప్తి కాంస్య పతకం, 64 కిలోల విభాగంలో ఎస్.షైనీ రజిత పతకం సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారుణులను కేజీబీవీ ప్రిన్సిపల్ నాదెండ్ల స్రవంతి పీఈటీ బి.హెప్సీబా అభినందించారు. బంగారు పతకం సాధించిన క్రీడాకారిణి ఎం.పూర్ణిమ డిసెంబరు 25 నుంచి 30 వ తేదీ వరకు రాజస్థాన్ లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ స్రవంతి తెలిపారు.


జాతీయ పిస్టల్ షూటింగ్‌లో ప్రణవికి కాంస్యం



కాంస్య పతకంతో ప్రణవి

రంగాయపాలెం (కొత్తపట్నం): 66వ జాతీయ పిస్టల్ షూటింగ్ విభాగంలో జిల్లా వాసికి కాంస్య పతకం లభించింది. కొత్తపట్నం మండలం రంగాయపాలెం పంచాయతీ వలసపాలెం గ్రామానికి చెందిన ద్వారం ప్రణవి ఈ నెల 19 నుంచి 25 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం భోపాల్‌లో నిర్వహించిన 66వ జాతీయ 10 మీటర్ల షూటింగ్ మిక్స్‌డ్ జూనియర్ విభాగం పోటీల్లో పాల్గొని కాంస్య పతకం సాధించింది. అదేవిధంగా జాతీయ 10 మీటర్ల షూటింగ్ జూనియర్ విభాగంలో జాతీయ గ్రూప్ ఏ టీమ్‌కు ఎంపికైంది. భోపాల్‌లో నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అఫిషియల్స్ వారి నుంచి కాంస్య పతకం అందుకుంది. అదేవిధంగా అక్టోబర్ 30 నుంచి నవంబర్ 5 వరకు గోవాలో జరిగిన 37వ నేషనల్ షూటింగ్ గేమ్స్‌లో ఆల్ ఓవర్ ఇండియాలో 11వ ర్యాంక్ సాధించింది. ప్రస్తుతం ప్రణవి బెంగళూరులో మంజునాథ్ దగ్గర కోచింగ్ తీసుకుంటోంది. ఈ సందర్భంగా రాష్ట్ర రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు తొట్టెంపూడి సలలిత్, కార్యదర్శి డి.రాజ్‌కుమార్, ప్రణవి తండ్రి ద్వారం జాలిరెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్తంగా ఈ నెల 30వ తేదీ కొండపిలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 15 కంపెనీలతో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్పందన భవనంలో జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులకు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, డిప్యూటీ కలెక్టర్ లోకేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీపీవో నారాయణరెడ్డి, ఎంప్లాయిమెంట్ అధికారి భరద్వాజ్, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేదీప్యం..





కొత్తపట్నం సముద్ర తీరంలో కార్తీక స్నానాలు చేస్తున్న భక్తజన సందోహం



త్రిపురాంతకంలో ప్రత్యేక అలంకరణలో త్రిపురాంతకేశ్వర స్వామి

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసింది. తెల్లవారు జాము నుంచే ఆలయాల్లో భక్తులు పోటెత్తారు. కొత్తపట్నం, సింగరాయకొండ, ఈతముక్కల, పాకల, మడనూరు తదితర సముద్ర తీరప్రాంతాల్లో పెద్ద ఎత్తున భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఇసుకతో శివలింగాలకు రూపమిచ్చి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. దీప కాంతులతో ఆలయాలు దేదీప్యమానంగా వెలిగిపోయాయి. జిల్లాలో ప్రముఖ ఆలయాలైన త్రిపురాంతకం, భైరవకోన, జమ్ములపాలెం, మార్కాపురం చెన్నకేశవస్వామి ఆలయం, కొత్తపట్నం శివాలయం, ఒంగోలు కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయాల్లో దర్శనానికి భక్తులు పోటెత్తారు. శివాలయాల్లో ఏకాదశ రుద్రాభిషేకాలు, బిల్వార్చనలతో స్వామిని అర్చించారు.

- సాక్షి నెట్‌వర్క్



కొత్తపట్నం సముద్ర తీరంలో కార్తీక దీపాలతో యువతులు



భైరవకోనలో స్వామి దర్శనానికి బారులుతీరిన భక్తులు



ఒంగోలులోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



యర్రగొండపాలెం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో జ్వాలాతోరణం

కరెంట్ ఫుల్‌గా..

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పశ్చిమ ప్రకాశం పరిధి యర్రగొండపాలెం నియోజకవర్గంలోని మూడు మండలాల ప్రజలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలకు చెక్ పడనుంది. ఓవర్‌లోడ్ కారణంగా ఏర్పడుతున్న విద్యుత్ అంతరాయాలు తొలగిపోనున్నాయి. మంత్రి ఆదిమూలపు సురేష్ ప్రత్యేకంగా సమస్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీఎం రూ.145 కోట్లు మంజూరు చేశారు. సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను సీఎం వర్చువల్‌గా నేడు ప్రారంభించనున్నారు.

- పుల్లలచెరువు మండలం రంగన్నపాలెంలో విద్యుత్ సబ్‌స్టేషన్
- రూ.145 కోట్లు మంజూరు
- 8 ఎకరాల్లో సబ్‌స్టేషన్ నిర్మాణం
- నేడు సబ్‌స్టేషన్‌కు వర్చువల్‌గా సీఎం జగన్ శంకుస్థాపన
- పనులను పర్యవేక్షిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగే స్థలం

యర్రగొండపాలెం: నియోజకవర్గ పరిధిలో యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో తరచూ విద్యుత్ సమస్యలు ఏర్పడి ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారు. యర్రగొండపాలెంలో ఉన్న 132/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి పుల్లలచెరువు, త్రిపురాంతకం, యర్రగొండపాలెం మండలాల్లో ఉన్న 33/11 కేవీ సబ్ స్టేషన్‌లకు విద్యుత్ సరఫరా చేస్తారు. ఆయా మండలాల్లో పుల్లలచెరువు, ఉమ్మడివరం, యంగ్రపల్లి, చాపలమడుగు, కవలకుంట్ల, ముటుకుల, మర్రివేముల, సిద్ధనపాలెం, గణపవరం, మేడపి, కొలుకుల, సానికవరం, వీరభద్రాపురం, వెంకటాద్రిపాలెం, గంజివారిపల్లిలోని 15 విద్యుత్ సబ్ స్టేషన్లకు దాదాపు 80 మెగావాట్లకు పైబడి విద్యుత్ వాడతారు. ఓవర్‌లోడ్ వలన తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. దీనివలన రైతులు, వ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు, పొలాల్లోని మోటార్లు కాలిపోతుండటంతో రైతులు తీవ్రనష్టానికి గురవుతున్నారు. కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను మరమ్మతులు చేయడం, లేకుంటే ఆ స్థానంలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంలాంటివి విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటారు. అయితే ఆ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసేలోపు రైతులు పండించే పంటలు నీరులేక ఎండిపోవడం ఈ ప్రాంతంలో పరిపాటిగా మారింది. తరుచుగా విద్యుత్‌లో ఏర్పడుతున్న అంతరాయం, రైతుల బాధలు గమనించిన మంత్రి సురేష్ వారి కష్టాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన పుల్లలచెరువు మండలంలోని రంగన్నపాలెంలో 220/132/33 విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. అంతేకాకుండా ఆ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన రూ.145 కోట్ల నిధులను సైతం మంజూరు చేశారు. ఈ సబ్ స్టేషన్ ఏర్పాటు ద్వారా దాదాపు 40 మెగావాట్ల విద్యుత్‌ను సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంటుందని ఆ శాఖాధికారులు తెలిపారు. ఈ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు తాడేపల్లిలోని తన కార్యాలయం నుంచి సీఎం మంగళవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ రంగన్నపాలెంలో కేటాయించిన 8 ఎకరాల స్థలంలో కార్యక్రమాలు చేపట్టారు.

నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రధాన లక్ష్యం

ప్రజలు, రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. జిల్లాలో పూర్తిగా వెనకబడిన యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని గత పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. ఫలితంగా నియోజకవర్గం ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. విద్యుత్ కోసం రైతులు పడుతున్న కష్టాలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే విద్యుత్ సబ్ స్టేషన్ ఏర్పాటుకు అనుమతి ఇచ్చారన్నారు. ఆయనకు నియోజకవర్గ ప్రజలు ఎంతగానో రుణపడి ఉంటారని తెలిపారు. విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం 8 ఎకరాల మేరకు పొలం ఇచ్చిన రైతులను ఆయన అభినందించారు.

న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యం

- కలెక్టరేట్ భవనంపైకి ఎక్కి ఆత్మహత్యకు యత్నం
- రెండు గంటలపాటు హైడ్రామా
- నిలువరించి రక్షించిన పోలీసులు



డీజిల్ బాటిల్‌తో బెన్నీ



బెన్నీని కిందకు తీసుకుని వస్తున్న దృశ్యం

ఒంగోలు అర్బన్: తనకు న్యాయం చేయాలని ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదంటూ ఉమ్మడి ప్రకాశం జిల్లా చినగంజాంకు చెందిన బెన్నీ అనే యువకుడు కలెక్టరేట్ భవనం వద్ద ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన సోమవారం కలకలం రేపింది. కలెక్టరేట్ వద్ద యువకుడు మూడో అంతస్తు పైకి ఎక్కి డీజిల్ ఒంటిపై పోసుకుని భవనం పిట్టగోడపై కూర్చుని ఎవరైనా దగ్గరకు వస్తే కిందకు దూకుతానంటూ, తనకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యే శరణ్యమంటూ కేకలు వేశాడు. దీంతో సుమారు రెండు గంటలపాటు హైడ్రామా నడిచింది. స్పందన కార్యక్రమానికి వచ్చిన ప్రజలు పెద్ద ఎత్తున ఘటన స్థలానికి వచ్చి ఏ జరుగుతుందో అంటూ ఆందోళన చెందారు. విషయం తెలుసుకున్న డీఆర్‌ఓ, పోలీసులు, కలెక్టరేట్ ఉద్యోగులు కలెక్టరేట్ మూడో అంతస్తుకు చేరుకుని యువకుడితో ధైర్యం చెపుతూ మాటల్లో దింపి చాకచక్యంగా రక్షించారు. ఆత్మహత్యకు కారణాలను యువకుడే స్వయంగా తెలుపుతూ తమ కుటుంబానికి సంబంధించి ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం 20 ఏళ్ల కిందట తన అక్కలు దళిత నాయకుల తప్పుడు సూచనలు నమ్మి.. చివరకు ఆత్మహత్యకు పాల్పడి మరణించారన్నాడు. ఆ కేసుకు సంబంధించి తనకు ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మించి ఏళ్ల తరబడి దళిత నాయకులు కాలయాపన చేసి మోసం చేశారని, ఇప్పుడు కేసు రాజీ చేసుకోవాలని బెదిరింపులకు దిగారన్నారు. దీనిపై కలెక్టర్, ఎస్పీలకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తనకు న్యాయం చేయకుంటే మరణమే శరణ్యం అంటూ కన్నీటి పర్యంతం అయ్యాడు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

కలెక్టరేట్‌లో ఆత్మహత్యకు ప్రయత్నించిన యువకుడి అంశానికి సంబంధించి పూర్వాపరాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. గతంలో యువకుడి కుటుంబ సభ్యులైన ఇద్దరు మహిళలు ఆత్మహత్య చేసుకుని మరణించిన నేపథ్యంలో మానవతా దృక్పథంతో యువకుడికి అవకాశం ఉన్న వరకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటాం. దీనికి సంబంధించిన అంశం వారం క్రితమే స్పందన అర్జీల పరిగణలోకి తీసుకుని పరిశీలిస్తున్నాం. యువకుడు చేస్తున్న ఆరోపణలపై కూడా దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

- ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

నిమ్జ్, దొనకొండ భూముల పరిశీలన

- కలెక్టర్ దినేష్ కుమార్‌తో కలిసి పరిశీలించిన పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్
- పరిశ్రమల ఏర్పాటుకు భూసేకరణ, ఇతర వనరులపై ఆరా



నిమ్జ్ ల్యాండ్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ దినేష్ కుమార్

పామూరు/దొనకొండ: జిల్లాలోని పలుచోట్ల పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదించిన భూములను రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి యువరాజ్, కలెక్టర్ ఎ.దినేష్‌కుమార్‌తో కలిసి సోమవారం పరిశీలించారు. పామూరు మండలంలోని మాలకొండాపురం వద్ద భూములను పరిశీలించిన వారు తరువాత పామూరు, పీసీపల్లి మండలాల్లో నిమ్జ్‌కు కేటాయించిన 12 వేల ఎకరాల వివరాలపై కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్, తహసీల్దార్ ఆవుల సురేష్ తో చర్చించారు. భూసేకరణకు సంబంధించి ఆరు గ్రామాల్లో వివరాలు, ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర భూములపై చర్చించారు. నిమ్జ్ ఏర్పాటు చేయాలంటే ముఖ్యవనరు అయిన నీటి వసతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వెలిగొండ, రాళ్లపాడు ప్రాజెక్టుల గురించి ప్రస్తావనరాగా ప్రతిపాదిత నిమ్జ్ ప్రాంతానికి వెలిగొండ రిజర్వాయర్, రాళ్లపాడు ప్రాజెక్టులు ఎంతదూరంలో ఉన్నాయని, వాటి నీటి నిల్వ సామర్థ్యం, ఆయా రిజర్వాయర్ల నుంచి నిమ్జ్‌కు నీరు ఇచ్చేందుకు సాధ్యాసాధ్యాలపై చర్చించారు. అదేవిధంగా నిమ్జ్ ప్రాంతానికి రోడ్ కనెక్టివిటీ, విద్యుత్ సౌకర్యాల గురించి అడుగగా నిమ్జ్‌ప్రాంతంవద్ద నుండే 167బి జాతీయ రహదారి ఉందని ఆర్డీవో, తహసీల్దార్ వారికి వివరించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం గోపీకృష్ణ, మండల సర్వేయర్ కే.స్నేహ, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

దొనకొండలో..

ఇండస్ట్రియల్ హబ్ కోసం దొనకొండ మండలంలోని ప్రభుత్వ భూములను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువజ్‌తో కలసి సోమవారం పరిశీలించారు. గతంలో ఎమ్ఎస్ఎం పార్కుకు కేటాయించిన స్థలాన్ని కూడా పరిశీలించారు. మండలంలోని బాదాపురం, రుద్రసముద్రం, ఇండ్లచెరువు, రాగమక్కపల్లి గ్రామాల పరిధిలోని ప్రభుత్వ భూములను వారు పరిశీలించారు. మ్యాపులు పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ భూముల్లో పంటల సాగు, నీటివసతి, రవాణా సౌకర్యం, రహదారి, విద్యుత్ సరఫరా లాంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. నేషనల్ హైవే రహదారులకు, గ్రామాలకు ఆ భూములు ఎంతదూరంలో ఉన్నాయి, మాన్‌పవర్ ఎలా ఉంటుంది అనే అంశాలపై ఆరా తీశారు. ఈ ప్రాంతంలో ఇండస్ట్రీలు ఏర్పాటు చేస్తే రెండు లక్షల మందికి ఉద్యోగాలు కల్పించవచ్చని కలెక్టర్ అభిప్రాయపడ్డారు. ఇండస్ట్రీల ఏర్పాటుకు అవసరమైన వసతులు, ప్రణాళికతో నివేదికను ప్రభుత్వానికి పంపనున్నట్లు కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ భవనానికి దర్శిలో స్థలం కేటాయించాలని రెడ్‌క్రాస్ సొసైటీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ కపురం శ్రీనివాసరెడ్డి కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ సార్య నాయక్, కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్, తహసీల్దార్ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జ్యోతిరావు పూలే వర్ధంతి

ఒంగోలు సెంట్రల్: మహాత్మా జ్యోతిరావు పూలే 133వ వర్ధంతి కార్యక్రమం వెనకబడిన తరగతులు సంక్షేమ, సాధికారిత శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించనున్నట్లు సంక్షేమ, సాధికారిత శాఖ జిల్లా అధికారి ఎం.అంజిలి తెలిపారు. ఒంగోలు ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని కొత్తకూరగాయల మార్కెట్ వద్ద జ్యోతిరావుపూలే విగ్రహానికి కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ నివాళులర్పిస్తారని చెప్పారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, బీసీ సంఘ నాయకులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

- స్పందన కార్యక్రమం నిర్వహించిన జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు



అర్జీలు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు

ఒంగోలు అర్బన్: గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అధికారులు, ఉద్యోగులు చిత్తశుద్ధితో ప్రజా సమస్యలు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు సూచించారు. సోమవారం స్పందన భవనంలో స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తొలుత డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం ద్వారా దూర ప్రాంత ప్రజల సమస్యలను ఫోన్ ద్వారా తెలుసుకుని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్పందన అర్జీలను సకాలంలో సహేతుకంగా పరిష్కరించాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఒకవేళ పరిష్కారం చేయలేకుంటే అందుకు కల కారణాలను అర్జీదారులకు వివరించాలన్నారు. దీనిలో డీఆర్‌ఓ శ్రీలత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఉమాదేవి, లోకేశ్వరరావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

- కొమరోలు మండలం రెడ్డిచెర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి సర్వే నంబర్ 1163-2ఏ, 2బిలో తన భూమిని అధికారులు ఆన్‌లైన్ చేయడం లేదని ఫిర్యాదు చేశారు. పరిశీలించి తన భూమిని సర్వే చేసి ఆన్‌లైన్ చేసేలా చర్యలు తీసుకోవాలని విన్నవించాడు.
- కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన పద్మ ఫోన్ చేసి ఖాతా నంబర్ 305లో రెండు సర్వే నంబర్లలో తండ్రి పేరు బదులుగా ఇంటి పేరు పొరపాటున పడటం వల్ల తొలగించారని, తన పొలాన్ని ఆన్‌లైన్ చేసేలా చూడాలని కోరారు. స్పందించిన జాయింట్ కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

జనగళం



జగనన్న చేదోడు, విద్యా దీవెన ఆదుకున్నాయి



వృత్తిరీత్యా టైలర్‌ని. నా ఇద్దరు పిల్లలు చదువుకుంటున్నారు. జగనన్న సురక్ష పథకంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎవరి చుట్టూ తిరగకుండా కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు వలంటీర్ ద్వారా తీసుకున్నాం. నా వృత్తి పరంగా నాకు జగనన్న చేదోడు పథకం కింద ఏటా డబ్బులు వస్తున్నాయి. మా పెద్ద అమ్మాయి ఐఐఐటీ ఒంగోలులో బీటెక్ చివరి సంవత్సరం చదువుతోంది. రెండో అమ్మాయి పేస్ ఇంజినీరింగ్ కళాశాలలో రెండో సంవత్సరం చదువుతోంది. వీరిద్దరికీ జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా నగదు వస్తోంది. మా పిల్లల చదువులో జగనన్న ఆదుకున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

- కళ్లగుంట సుధాకరరావు, టైలర్, జరుగుమల్లి.

మత్స్యకారుల పెన్షన్‌తో ఊరట



నాకు మత్స్యకారులకు పెన్షన్ ప్రకటించిన రోజు నుంచి క్రమం తప్పకుండా పెన్షన్ అందుకుంటున్నాను. గతంలో చేపల వేట లేని రెండు నెలల కాలం కాళ్లు ముడుచుకుని ఇంటిలో కూర్చోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ఇప్పుడు జగనన్న వచ్చాక మత్స్యకారులకు కూడా పెన్షన్ ఏర్పాటు చేయడంతో నాలాంటి వారికి ఊరట లభిస్తోంది. వేట లేని సమయంలో నాలుగు వేళ్లు లోపలికి పోతున్నాయి. జగనన్న చల్లగా ఉండాలి.

- కోలా జీవరత్నం, అన్నంగి, మద్దిపాడు మండలం

ప్రభుత్వ బడిలో మెరుగైన సౌకర్యాలు సమకూరాయి



నా ఇద్దరు పిల్లలు జరుగుమల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్నారు. నేను చదువుకొనే రోజుల్లో మా బడిలో ఎలాంటి సౌకర్యాలు ఉండేవి కావు. కానీ ఇప్పుడు జగనన్న ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ పాఠశాలల్లో అన్నీ మెరుగైన సౌకర్యాలు సమకూరాయి. మా చిన్న కుమారుడు శరణ్ సాయి తేజకు అమ్మ ఒడి పథకం వస్తోంది. పాఠశాలలో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకం బాగుంది. ఇంగ్లిషు మీడియంలో చదువు చెబుతున్నారు. విద్యకు ప్రాధాన్యతనిచ్చి ప్రభుత్వ బడుల్లో ఇన్ని సౌకర్యాలు కల్పిస్తున్న సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

- విస్సా వరలక్ష్మి, జరుగుమల్లి గ్రామం, జరుగుమల్లి మండలం.

అమ్మఒడి డబ్బు ఎంతో ఉపయోగపడింది



నాకు ముగ్గురు ఆడపిల్లలు. మా ఆయన ఆటో నడుపుతుంటాడు. పిల్లలకు చదువుల చెప్పించాలంటే ఎక్కువ ఖర్చు. అందులోను ఆడపిల్లలను బయటకు పంపాలంటే ప్రతి రూపాయి జాగ్రత్త చేసుకోవాలి. కుటుంబ ఖర్చులు పెరిగిపోతున్న సమయంలో జగనన్న ముఖ్యమంత్రి అయిన దగ్గర నుండి అమ్మఒడి ద్వారా బడికి వెళ్లే పిల్లలకు రూ.15 వేలు ఇస్తుండంతో ఆ డబ్బు ఎంతో ఉపయోగపడుతోంది. పిల్లలు చదువుల్లో చురుకుగా ఉంటున్నారు. మేము కూడా పనులకు వెళుతూ రూపాయి కూడబెడుతున్నాం. ఆడపిల్లలని చదివించడానికి జగనన్న మాకు సహాయపడడం నిజంగా అదృష్టం. ఆయనకు మేలు జరగాలని ఆదేవుని ప్రార్థిస్తున్నాను.

- కుంచాల తిరుపతమ్మ, అన్నంగి, మద్దిపాడు మండలం

ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యం

- ఎస్పీ స్పందనకు 95 అర్జీలు
- అర్జీదారులతో నేరుగా మాట్లాడిన ఎస్పీ మలికాగర్గ్


అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: ప్రజా ఫిర్యాదుల సత్వర పరిష్కారమే లక్ష్యంగా స్పందన నిర్వహిస్తున్నట్లు ఎస్పీ మలికాగర్గ్ తెలిపారు. స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో గెలాక్సీ భవన్‌లో సోమవారం స్పందన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి ఎస్పీ స్పందనకు 95 ఫిర్యాదులు వచ్చాయి. అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. పూర్వాపరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని చట్ట పరిధిలో త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అర్జీలలో కుటుంబ కలహాలు, భార్యాభర్తల, అత్తారింటి వేధింపులు, భూ వివాదాలు, జాబ్ మోసాలతో పాటు ఇతర సమస్యల గురించి ప్రజలు వినతులు సమర్పించారు. ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, దిశ డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ వి.శ్రీనివాస రావు, ఐసీసీఆర్ ఇన్‌స్పెక్టర్ దుర్గాప్రసాదు, ప్యానల్ అడ్వకేట్ బీవీ శివ రామకృష్ణ, స్పందన సిబ్బంది పాల్గొన్నారు.




కొత్తపట్నం సముద్ర తీరంలో సైకత శివలింగాలకు పూజలు చేస్తున్న అయ్యప్ప, భవానీ మాలధారులు, మహిళలు


భైరవకోనలో పూజలందుకుంటున్న త్రిముఖదుర్గ

ఓం.. శివోహం

కార్తీక పూజలతో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత
శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. సోమవారం వేకువజాము నుంచే శివాలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. సామూహిక కుంకుమార్చన, వ్రతాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సముద్ర స్నానాలకు తరలివచ్చిన భక్తులతో కొత్తపట్నం, పాకల తీరప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్


మార్కాపురంలో ప్రత్యేక అలంకరణలో మార్కండేశ్వరస్వామి


సంతనూతలపాడు శివాలయంలో దీపాలతో శివలింగాకృతి


కురిచేడులోని కాళహస్తీశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


భైరవకోన జలపాతం వద్ద భక్తుల సందడి


టంగుటూరు : జమ్ములపాలెం శివాలయంలో 1116 శివలింగాలకు భక్తుల పూజలు


త్రిపురాంతకేశ్వర స్వామి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


సింగరాయకొండ : పాకల సముద్ర తీరంలో భక్తుల కోలాహలం


కొత్తపట్నం తీరంలో సముద్ర స్నానం ఆచరిస్తున్న భక్తులు

గంగపాలెంలో నాటుబాంబు కలకలం


బాంబు పేలి మృతి చెందిన కుక్క

దర్శి: మండలంలోని గంగపాలెం గ్రామ పొలాల్లో నాటుబాంబు కలకలం రేపింది. పశువులతో పాటు వెళ్లిన పెంపుడు కుక్క వాసన పసిగట్టి కొరకడంతో బాంబుపేలి కుక్క అక్కడికక్కడే మృతి చెందింది. ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో పశువుల కాపరులు భయంతో పరుగులుతీశారు. ఈ సంఘటనపై ఎస్సై రామకృష్ణను వివరణ కోరగా..నాటుబాంబులు పేలినట్లు తమకు ఎలాంటి ఫిర్యాదులు రాలేదని, అడవిపందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు పెట్టే ఉల్లిపాయ బాంబులు వంటి మందుగుండు సామగ్రి అయి ఉంటుందని భావిస్తున్నామన్నారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అండర్ -17 కబడ్డీ జాతీయ జట్టుకు ఎంపిక


క్రీడాకారులకు అభినందిస్తున్న డీఈఓ

ఒంగోలు సెంట్రల్: స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో చిత్తూరు జిల్లా చౌడపాలెంలో జరిగిన అండర్ -17 కబడ్డీ ప్రకాశం జిల్లా బాలికల జట్టు మూడవ స్థానం సాధించినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కె.వనజ తెలిపారు. జాతీయస్థాయి జట్టుకు నిరీక్ష, పోలమ్మ ఎంపికైనట్లు చెప్పారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కోచ్ కిరణ్‌కుమార్‌రెడ్డి, టీఎం మేనేజర్ శ్రీనివాసులను డీఈఓ, ఎస్‌జీఎఫ్ జిల్లా కన్వీనర్ ఎస్ సుబ్బారావు, సెక్రటరీ కె.వనజ, మాజీ కబడ్డీ క్రీడాకారులు, వ్యాయామ సంఘ కార్యదర్శి వై శీనయ్యలు అభినందించారు.

ఆరోగ్యకర జీవనశైలికి 'ఆడుదాం ఆంధ్రా'

- సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు క్రీడా పోటీలు
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్ర పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ప్రకాశంభవనంలో విలేకర్ల సమావేశం నిర్వహించి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలను పోత్సహించేలా ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా గ్రామ, వార్డు సచివాలయ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి క్రీడా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. క్రికెట్, వాలీబాల్, ఖోఖో, బ్యాడ్మింటన్ డబుల్స్ విభాగంలో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిసెంబర్ 15వ తేది నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు పోటీలు జరుగుతాయని తెలిపారు. 15 ఏళ్ల వయసు నిండి పురుషులు, మహిళలు పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ నెల 27వ తేది నుంచి ఆడుదాం ఆంధ్ర పోటీల్లో పాల్గొనే వారు పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. పోటీల్లో పాల్గొనే వారు నేరుగా సచివాలయంలో తెలియచేయం, 1902 నంబర్‌కు ఫోన్ చేయడం, www.aadudamandhra.ap.gov.in వెబ్‌సైట్‌లో కానీ నమోదు చేసుకోవచ్చన్నారు. స్థానికులతో పాటు ఆయా ప్రాంతాల్లో చదువుకుంటున్న వారు కూడా పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఎవరైనా కేవలం రెండు విభాగాల్లో మాత్రమే పోటీ చేయాలన్నారు. డిసెంబర్ 15వ తేది నుంచి జనవరి 1వ తేదీ వరకు సచివాలయ స్థాయిలో ఆ తర్వాత రెండు వారాల పాటు మండల స్థాయిలో, జనవరి 16వ తేదీ నుంచి వారం రోజులు నియోజకవర్గ స్థాయిలో, 22వ తేది నుంచి జిల్లా స్థాయిలో, 29వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతాయని వివరించారు. అయితే సచివాలయ, మండల స్థాయిలో ప్రైజ్ మనీ లేకుండా కేవలం సెలక్షన్స్ మాత్రమే ఉంటాయన్నారు. నియోజకవర్గ స్థాయి నుంచి తొలి మూడు స్థానాల్లో ఉన్న వారికి ప్రైజ్‌మనీ ఉంటుందన్నారు. ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా విజేతల వివరాలను అప్పటికప్పుడే రాష్ట్ర డేటా బేస్‌లో నమోదు చేస్తారని తెలిపారు. ఫిబ్రవరి 3వ తేదీ విశాఖపట్నంలో ముగింపు ఉత్సవాలు జరుగుతాయన్నారు. వీటిలో ప్రభుత్వ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొనేందుకు అవకాశం లేదన్నారు. గ్రామ స్థాయిలో విజేతలైన వారిని మండల స్థాయికి, అక్కడ గెలుపొందిన వారిని నియోజవకర్గ స్థాయికి, వారిలో విజేతలైన వారిని జిల్లా స్థాయికి అక్కడి విజేతలను రాష్ట్ర స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. సచివాలయ, మండల స్థాయి పోటీలకు బేసిక్ కిట్స్, నియోజకవర్గ, జిల్లా స్థాయి పోటీలకు ప్రొఫెషనల్ కిట్లు సరఫరా చేస్తామన్నారు. ఇప్పటికే కిట్లు జిల్లాకు చేరినట్లు తెలిపారు.

జిల్లాలో పోటీల నిర్వహణ కోసం పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓలు, నియోజకవర్గ ప్రత్యేకాధికారులు, ఆర్‌డిఓలను భాగస్వాములను చేస్తూ ప్రత్యేకంగా నిర్వహణ కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిర్వహణ కోసం స్థానికులు, దాతల సహకారం తీసుకుంటామన్నారు. నియోజవకర్గ ఆపై స్థాయి పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు అవసరమైన రవాణా, వసతి సౌకర్యాలను ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. సచివాలయానికి 10 లెక్కన జిల్లాలో 7190 మంది క్రీడా వలంటీర్లను, 291 మంది పీడీ, పీఈటీలను క్రీడల నిర్వహణలో భాగస్వాములు చేస్తున్నామని తెలిపారు. క్రీడల నిర్వహణ, పర్యవేక్షణ కోసం జిల్లా స్థాయిలో కమాండ్ కంట్రోలు కేంద్రాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాకు ఇద్దరు అంబాసిడర్లను నియమించారన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఆత్మరక్షణ క్రీడలో బంగారు పతకం సాధించిన ఒంగోలుకు చెందిన పి.మనోజ్‌సాయి, అంతర్జాతీయ స్థాయిలో ఖోఖో క్రీడలో బంగారు పతకం సాధించిన ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన పి.శివారెడ్డిని స్పోర్ట్స్ అంబాసిడర్‌లుగా నియమించినట్లు తెలిపారు. దీనిలో ట్రైనీ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, స్టెప్ సీఈఓ లోకేష్, క్రీడా ప్రాధికారి సంస్థ చీఫ్ కోచ్ రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అనంతరం క్రీడలకు సంబంధించిన లోగో, బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

ఆటో, బైక్‌ను ఢీకొన్న కారు


ప్రమాదంలో గాయపడిన మహిళలు


కారును పరిశీలిస్తున్న ఎస్సై శ్రీరామ్

- 9 మందికి గాయాలు

సింగరాయకొండ: కారు అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆటో, బైక్‌ను ఢీకొనడంతో 9 మందికి గాయాలయ్యాయి. ఈ సంఘటన సోమవారం సింగరాయకొండ మండల పరిధిలోని జాతీయ రహదారిపై జీవీఆర్ ఫ్యాక్టరీ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఒంగోలు వైపు వెళ్తున్న కారు జీవీఆర్ ఫ్యాక్టరీ సమీపంలోకి రాగానే అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో అదుపు తప్పి పక్కనే వెళ్తున్న బైక్‌ను ఢీకొనగా అతను రోడ్డు పక్కన పడిపోవడంతో గాయాలయ్యాయి. ఉలవపాడు మండలం కరేడు పంచాయతీ అలగాయపాలెం నుంచి జీవీఆర్ ఫ్యాక్టరీలో కూలీ పనికి ఆటోలో వస్తున్న పది మందిలో 8 మంది గాయపడ్డారు. ఆటోలో ప్రయాణిస్తూ గాయాలపాలైన జాన్‌వలి, వంశీ, అఖిలాష, లక్ష్మి, రమణమ్మ, మరియమ్మ, రాణి, స్రవంతితోపాటు సింగరాయకొండకు చెందిన మోటారుసైకిలిస్టు సుబ్బారావును హైవే అంబులెన్స్‌లో ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై టి.శ్రీరామ్ పరిశీలించారు. క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పోలీస్ క్రీడాకారులకు ఎస్పీ అభినందన


కాంస్య పతకం సాధించిన రత్నబాబును అభినందిస్తున్న ఎస్పీ


ఆల్ ఇండియా జూడో పోలీస్ క్లస్టర్ పోటీల్లో పాల్గొననున్న క్రీడాకారులతో ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: గోవాలో ఇటీవల నిర్వహించిన 37వ నేషనల్ పోలీస్ గేమ్స్‌లో పెన్‌కాక్ సిలాట్‌లో 80–85 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించిన ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్ డీఎస్‌వీ రత్నబాబును ఎస్పీ మలికాగర్గ్ అభినందించారు. అదే విధంగా అసోంలో 2024 జనవరి 5 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్-2023 జాతీయ స్థాయి పోటీల్లో ఏపీ పోలీస్ శాఖ తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్న క్రీడాకారుల బృందాన్ని ఎస్పీ అభినందించారు. సోమవారం ఒంగోలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులతో ముచ్చటించారు. అసోంలో తైక్వాండో, కరాటే, ఫెన్సింగ్, ఉషు, పెన్‌కాక్ సిలాట్ పోటీల్లో పాల్గొననున్న ఈ బృందం ప్రస్తుతం ఒంగోలు డీటీసీలో శిక్షణ పొందుతోంది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. విధులు నిర్వర్తిస్తూనే క్రీడల్లో ప్రతిభ చాటుతూ పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్టలు పెంచుతున్నారని కొనియాడారు. జాతీయ స్థాయి పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు, ఎస్‌బీ డీఎస్పీ బి.మరియదాసు, కోచ్‌లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.